# కట్‌పుత్లీ

# 5



రాజస్థాన్ రాజధాని నగరం నడిబొడ్డున నిలబడి ఉన్నానన్న విషయం ఎంతకీ నమ్మశక్యం కావట్లేదు.

నిజం. నేను ఆరావళీ పర్వతాల నడుమ అందంగా అమరిన గులాబీ నగరంలోనే వున్నాను.

భారతీయ హస్త కళాప్రపంచపు కలికితురాయి జైపూర్ నగరంలోనే వున్నాను.

అబ్బ! ఎన్నాళ్ళనుండీ ఈ రాజస్థాన్‌ను చూడాలని కోరిక చివరికి ఎలాగయితేనేం - వచ్చేసింది.

శశికిరణ్ తన పదివేలమంది సహవైద్యులతో అదుగో..... ఆ ఎదురుగా వున్న బిర్లా కన్వెన్షన్ సెంటర్‌లో వున్నాడు. అక్కడ ప్రపంచం నలుమూలలనుండి వచ్చిన వైద్యుల సదస్సు జరుగుతోంది.

ఇవ్వాళే మొదటిరోజు.

ప్రారంభోత్సవ కార్యక్రమాలతో హడావుడిగా వుంది.

ఇక ఆ వైద్యుల వైద్యేతర కుటుంబీకులు నాలాగే నగర శోధనకు బయలుదేరే సన్నాహాలు చేసుకుంటున్నారు.

"మమ్మీ...... అదుగో కేమెల్......" ఐదేళ్ళ లాస్య సంబరంగా చప్పట్లు కొడుతూ నా చేయిపట్టి లాగింది.

పరాయిఊళ్ళో నన్ను పట్టించుకొనే వాళ్ళెవరూ-?

నేను సంబరంగా చప్పట్లు కొట్టాను. లాస్యలాగానే.

ఒకరి ముఖాలు ఒకరం చూసుకుని నవ్వుకున్నాం పక పక.

ఒకరి వెనుక ఒకరం పరుగులు తీస్తూ కన్వెషన్ సెంటర్ చుట్టూ ఓసారి తిరిగేసాం.

పెద్ద పెద్ద డేరాలలో అతిథులందరికి భోజనాల ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఆ డేరాల మీది రంగురంగుల చిత్రికలు విస్మయం కలిగిస్తున్నాయి. అక్కడక్కడా అద్దాలలో రంగుల రంగుల దారాలతో రాజస్థానీ పనితనం ప్రశంసనీయం. పువ్వులు..... లతలు...... అబ్బబ్బో.....

ఒక పక్కన వంటలు, కమ్మని వాసనలు కలబోసుకుని గాలి పరిమళిస్తోంది.

సదస్సు తరపున "లోక్‌రంగ్" వారు ఏర్పరచిన "బజార్" లోకి వెళ్ళాం.

స్థానిక హస్తకళల ప్రదర్శన అది.

ఓ పక్కన మోహందీ పెడుతున్నారు. ఓ పక్కన స్థానిక కళాకారులు ఆపకుండా నాట్యాలు చేస్తూనే వున్నారు. మరో పక్కన గానాబజానాలు ఒంటె సవారీలు. ఏనుగు అంబారీలు. ఎక్కడ చూసినా కళకళలాడుతోన్న రంగులు నిండు పసుపు. నిండు ఎరుపు. నిండు గులాబీ - ఆకుపచ్చ.... అబ్బ!

"మమ్మీ....... మమ్మీ........ అటు చూడు.... పపెట్‌షో".

లాస్య పరిగెత్తింది. లాస్యను అందుకోవడానికి నేనూ పరిగెత్తాను.

అక్కడ కథకుడు డోలక్ వాయిస్తూ హుషారుగా పాడుతున్నాడు. కట్‌పుత్లీల నాట్యం జానపద కళాకారిణుల కన్నా జోరుగా సాగుతోంది. మధ్యలో ఆడకంఠం వినిపిస్తోంది. మరో పాపకంఠం సందర్భాన్ని బట్టి తెరవెనుక నుంచి.

రాజ్‌కుమారీ....... కువర్‌జీ..... వారిద్దరి ప్రణయం.

మహారాణి మహారాజాల ప్రళయం.

కొంత విరహం.

చివరికి వారి వివాహం.

తమాషాగా నవ్విస్తూ, ఆడిస్తూ, నాట్యం చేస్తూ ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తున్నారు.

ఇక ఒక పల్లెయువతి కథ.

రాజుగారు రమ్మన్నా మణిమాన్యాలిస్తానన్నా రాను పొమ్మంది.

రాణీగారు రమ్మన్నా ముత్యాలపల్లకి తెస్తానన్నా రాను పొమ్మంది.

అత్త రమ్మన్నా రానంది. మామ రమ్మన్నా రానంది.

మొగుడు మొట్టికాయ వేసి లాక్కెళ్తే ముసిముసి నవ్వులు నవ్వుతూ చక్కా పోయింది.

లాస్య పకపకలాడింది.

ఇక వచ్చింది కువర్‌జీ గుర్రం సవారీ.

యువరాజా గారు కొత్త గుర్రం ఎక్కారు.

ఆ గుర్రం ఆయన్ను ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువులనీళ్ళు తాగించింది. రాజ్‌కుమారిని చూడగానే బుద్ధిగా నడవడం మొదలెట్టింది.

ప్రేక్షకులందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు.

డోలక్ వాయిద్యగాడు గబగబ లేచి వచ్చి కట్‌పుత్లీలను అమ్మకానికి పెట్టాడు. చక్కగా అమర్చిన

ఇత్తడి నగలు. వాటిని ఆడించడానికి వీలుగా అక్కడక్కడ కట్టిన పొడవాటి నల్లటి దారాలు. లాస్య ముదురు గులాబీ రంగు జోడీ కావాలంది.

తనకు ఎర్రటిది నచ్చింది.

"రెండింటిని తీసుకోండి మేమ్‌సాబ్" చిన్నికంఠం హిందీలో నన్ను పలకరించింది. ఇందాక తెరవెనుకటి కంఠమే. లాస్యకన్నా రెండేళ్ళో మూడేళ్ళో పెద్దదయి ఉండొచ్చు

"మీరు మంచివి ఎంచుకున్నారు మేమ్‌సాబ్"

ఆ అమ్మాయి బుగ్గలు సొట్టలు పడేట్టు నవ్వింది.

"ఇందాకటి నుంచి పాటలు పాడుతూ కట్‌పుత్లీలను ఆడించింది నువ్వేనా?"

ఆశ్చర్యంగా అడిగాను నేను హిందీలోనే

ఆ అమ్మాయి ముతక లంగా చివర్లతో ముఖం దాచుకుంటూ సిగ్గుపడింది. పాప జుట్టు ఎర్రబడివుంది. తల మీదుగా చిన్న దుపట్టా వేసుకొనివుంది.

అద్దాల గాగ్రాచోళీ. చేతుల నిండా గాజులు. పోషణ లేనితనం, లేమితనం కనిపిస్తోంది.

"నీ పేరేంటి'" నా హైదరాబాదీ హిందీ అర్థమవుతోందా లేదా నాకు సందేహం వచ్చింది. అడిగిన ప్రశ్న మళ్ళీ అడిగాను.

"అంజూ......" ఆ పాప పలుకు పలుకుకూ పన్నెండున్నర మెలికలు తిరుగుతూ నవ్వుతూ చెప్పింది.

"ఇప్పుడింత సిగ్గుపడుతున్నావే ఇందాక ఎంత చక్కగా పాడావ్–" ప్రశంసించాను.

"అమ్మా..... అమ్మా...." లాస్య రహస్యంగా నా చేయి పట్టి లాగింది.

"నా ఫైవ్‌స్టార్ ఇచ్చేయనా–"

"ఊ....!" నేను లాస్యను ప్రోత్సహించాను.

లాస్య తన సస్పెండర్ జేబులోంచి చాక్లెట్ తీసియిచ్చింది.

అంజు తీసుకోకుండా సిగ్గు పడుతూ వెనక్కి జరిగింది.

"ఫర్వాలేదులే తీసుకో అంజూ....... నువ్వు చక్కగా బొమ్మల్ని ఆడించావ్‌గా అందుకు......"

"లే....లే.....బేటీ......" ఒక స్త్రీ కంఠం విన్పించింది.

ఈమె కంఠమూ ఇందాక తెరవెనుకటి కంఠమే.

అంజు ఆ చాక్లెట్‌ని లాస్య చేతిలోనుంచి ఒక్కసారిగా లాక్కుని నవ్వుతూ పరిగెత్తి వెళ్ళిపోయింద.

"ఈ కట్‌పుత్లీలు మీకు నచ్చాయా మేమ్‌సాబ్...."

"అవును. ఈ రెండు జతలూ తీసుకుందామని...."

"మేమ్‌సాబ్...... ఇవి జోడీ నూటయాభై రూపాయలు...." అంజు తల్లి గట్టిగా అంది.

"అంత చేయవు. సాయంత్రం రండి యాభై రూపాయలకే ఇస్తాను." ఆమె వెంటనే కంఠం తగ్గించి రహస్యంగా అంది. ఆమె అలా అనేటప్పుడు కనుచివరలతో భయం భయంగా అటూ ఇటూ చూడటం గమనించాను.

యాభై రూపాయల ఖరీదు చేసే బొమ్మల్ని నూటయాభైకి అమ్ముతున్నారా బాప్‌రే! ఇక ఈ ఊళ్ళో ఏ వస్తువైనా కొన్నట్లే.

నేను ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆమె ముఖంలోకి సూటిగా చూసాను. ముఖాన్ని సగంవరకూ వోణీ ముసుగేసి వుంది. కనిపిస్తున్నంతలో ఈమె అంజులానే వుంది. కానీ బక్కపలచగా గడ్డాన పచ్చబొట్టుతో, ముక్కున అటూ ఇటూ వెండి పుడకలతో, మెడలో దిగేసిన వెండి ఆభరణంతో, చేతినిండా గాజులతో ఆమె నల్లటి అద్దాల లంగాపై ఆకుపచ్చని ఛోళీ - నిండుపసుపు వోణీని తలనిండా కప్పుకొని - అచ్చమైన రాజస్థానీ స్త్రీ.

"నీ పేరేంటి?" కుతూహలంగా అడిగాను.

"బసంతీ" ఆమె గుంభనంగా నవ్వింది. నవ్వుతూ ముఖం మీదికి ముసుగుని పూర్తిగా లాగేసుకుంది.

"మేమ్‌సాబ్ ఏమంటున్నారు బసంతీ?" డోలక్ వాయిద్యగాడు కేక పెట్టాడు.

"వందరూపాయలకి జత కావాలంట వీలు కాదన్నాను".

నేను అక్కడి నుంచి ఏమీ ఎరగనట్లు కదలిపోయాను.

లాస్య బొమ్మలు కొనలేదని గునుస్తూ నా వెంట నడిచింది.

మళ్ళీ డోలక్ శబ్దం మొదలయ్యింది.

లాస్యకి బోలెడంత ఉత్సాహంగా వుంది.

శీతాకాలపు నీరెండ వెచ్చదనంలో జైపూర్ పచ్చదనంలో ఉల్లాసం ఉరకలు వేస్తోంది.

భోజనాల వేళ శశికిరణ్‌ని కలిసేవరకు బోలెడన్ని సాహసాలు.

సదస్సు వారు ఏర్పాటు చేసిన నగర సంచారం టికెట్లని కొనిపెట్టేసాను. లాస్య ఆనందానికి అవధులే లేవు.

కట్‌పుత్లీల కథల గురించి వాళ్ళ నాన్నతో ఉల్లాసంగా చెప్పింది.

నేను కొనివ్వలేదని ఫిర్యాదు చేసింది.

అంజుకి చాక్లెట్ ఇచ్చానని ఘనంగా చెప్పింది.

"వెరీగుడ్ లాస్యా....... కీపిటప్!" శశికిరణ్ లాస్యను మురిపెంగా ముద్దాడాడు

"ఇంతకీ తమరి కార్యక్రమాలు ఎలా వున్నాయి? ఏమన్నా ఉపయోగంగా వున్నాయా?" నేను యధాలాపంగా అడిగాను.

"భలేవారండీ శ్రీమతి సరితగారూ – మనం వచ్చిందే సదస్సుకోసం – మీరేమో నగర సంచారంలో పడిపోతిరి. మరి మా సంగతేమిటండీ–"

"అందుకే చెప్తున్నా – బోర్ కొడితే వచ్చేయండి – బంగారు అవకాశం ఆలసించిన ఆశాభంగం!"

"అంటే ఏంటి నాన్నా?" లాస్య శశికిరణ్ చేయిపట్టిలాగింది

"అక్కడ గులాబ్‌జాంలు అయిపోవస్తున్నాయి. ఆలస్యమైతే మనకు ఏమీ ఉండవు అంటోంది మీ అమ్మ....."

కోవాతో నింపిన గులాబ్‌జాంలు – నోరూరించే రాజస్థానీ వంటకాలు జైపూర్ జిలేబీలు – గాజర్ కా హల్వా – భోజనం చకచకా ముగించి మళ్ళీ ఎక్కడ కలుసుకోవాలో నిర్ణయించుకొని నేనూ లాస్య టూరిస్ట్ స్టాల్ వైపు పరుగులెత్తాం.

బస్సులో అందరూ తల్లులూ పిల్లలే.

ఎంతో సరదాగా కొత్త పరిచయాలు చేసుకుంటూ. హడావుడి చేస్తూ బస్సు బయలుదేరింది.

నేను మా సదస్సు నిర్వాహకులు ఇచ్చిన ట్రావెల్‌గైడ్, మ్యాప్‌ల సహాయంతో ఏమేమి చూడాలో ఉదయమే నిర్ణయించుకొన్నాను. టూరిస్ట్‌గైడ్ చకచక పరిచయాలు చెప్తూ హవామహల్, అమేర్ ప్యాలెస్, జంతర్‌మంతర్, ఆల్బర్ట్ హాల్‌లను వాయువేగంతో చుట్టేసాడు. చివరిగా తీసుకెళ్ళి జల్‌మహల్ సమీపంలో బస్సు ఆపేసాడు.

అది ఒక ఫ్యాక్టరీ అక్కడ స్యాంగిణి బ్లాక్ ప్రింట్ వేసే విధానం చూపించారు. స్థానికంగా ప్రవహించే నది ఆ నీటిలో కూరగాయలరసాలను గుజ్జుని కలిపి తయారు చేసిన సహజమైన రంగులు

లాస్య అతని చేతిలోని బ్లాక్ తీసుకుని తనూ ముద్రించడానికి ప్రయత్నం చేసింది.

ఇక రెండుగంటలపాటు బస్సుడ్రైవర్, టూరిస్ట్‌గైడ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు.

సంచారం గానీ సందర్శించడానికి గానీ ఏమీ లేకపోవటంతో పర్యాటకులు ఎంతైనా చెల్లించి ఏదో ఒకటి కొంటున్నారు.

పర్యాటన రాజస్థానీయుల ప్రధాన వాణిజ్యం. పర్యాటకులే వారి అన్నదాతలు.

బసంతి పుణ్యమా అని ఇక్కడి వ్యాపార వ్యవహారం మొత్తం మీద పెద్ద అనుమానం చోటుచేసుకుంది. నా మనసులో. వాళ్ళు ఏం చెప్పినా గబగబ బేరీజు వేసేస్తోన్నా నా ప్రమేయం లేకుండానే. మూడింతల ఖరీదు ముచ్చెమటలు పోయిస్తుంది.

చూసి ఆనందించడమే మంచిదని, లాస్యతో సహా చక్కని హస్తకళా ప్రదర్శననూ చూసినట్లు

చూసేసి నీరసంతో వెనుదిరిగాం.

మా నిరాశ నిస్పృహలను సాయంకాలం ఏర్పాటు చేసిన సదస్సువారి సాంస్కృతిక కార్యక్రమం పటాపంచలు చేసింది.

రాణీమంచ్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో రాజస్థానీ లోక్ నృత్యాలు రాజస్థాన్‌లోని ఉత్తమ నర్తకులచే.

తనెలాగైనా చూడాలని ఉవ్విళూరుతోన్న కాలాబేలియానాట్యం.

సపేరాలు - పాములు పట్టుకొనే వాళ్ళు - చేసే నాట్యం అది.

నల్లటి దుస్తుల్లో గిరగిరా తిరుగుతూ పాములబూరకు అనుగుణంగా డోలక్..... మృదంగం...

"ర.... ర...... రర...... రర రరా ......' అంటూ నాట్యం చేస్తోంది. అమ్మాయి.

తర్వాత భవయా నృత్యం.

కుండమీద కుండ పెట్టుకుని - పదిహేనుకుండలు పెట్టుకొని పన్నెండేళ్ళ పాప గాజు పెంకులమీద, కత్తులమీద, మేకులమీద నృత్యం.

లాస్య అయితే భయం, ఉత్కంఠ, కుతూహలం కలబోసిన స్థితిలో నాట్యం చూస్తోంది.

తనకూ బోలెడంత ఆశ్చర్యం వేసింది.

ఆ పాప కాళ్ళకు చిన్న గాయం కూడా కాలేదు.

రక్తం ధారలు కడుతుందేమో అని భయపడిపోయాను.

నా భయాలు విని శశి పకపక వవ్వాడు.

"సరితా...... నువ్వు చిన్న పిల్లలాగా ఏంటది? చూడు ఆ గాజుపలకలని చదరంగా కోస్తే నువ్వైనా వాటిమీద ఎక్కి నాట్యం చెయొచ్చు. ఇక ఆ కత్తుల మొనల్ని సరిగ్గా చూడు. నునుపు చేసి ఉన్నాయి. పదునుగా లేవు. చూశావా.... ఆ మేకులమొనలు కూడా చెక్కిలేవు. గుండ్రంగా ఉన్నాయి. అంతేకాదు........ ఆ కత్తుల్ని మేకుల్ని ఎంత దగ్గర దగ్గరగా అమర్చారో చూసావా.....? దానివల్ల సులువుగా నాట్యం చేయొచ్చు....."

"నిజమేనేమో....... కానీ నాకింకా నమ్మబుద్ధి కావటం లేదు.........

"నిజానికి మెచ్చుకోవాల్సింది అంత చిన్న అమ్మాయి అన్ని కుండల్ని తన మీద చిన్న గ్లాసుపై బ్యాలెన్స్ చేయగలగడాన్ని, అలాగే వంగి నేలమీద రూపాయిని నోటితో తీసిందిచూడు... అప్పుడైతే బ్యాలెన్స్ తప్పిపోతుందనుకున్నా.........."

"అవునవును నాకూ భయమేసింది." లాస్య కళ్ళు టపటప లాడించింది.

మర్నాడు హోటల్ వారి ట్రావెల్ ఏజెంట్ ద్వారా నగర సంచారానికి బయలుదేరాం. శశిని

బిర్లాలో వదిలి.

ఈ టాక్సీడ్రైవర్ పేరు హంస్‌రాజ్.

వయసు పాతికేళ్ళలోపే ఉండొచ్చు.

హంస్‌రాజ్ అన్నాడు.

"పెళ్ళి కాలేదింకా. నాన్నకు వయసైపోయింది. పల్లెలో ఉన్నాడు. వ్యవసాయం చేస్తాడు."

నాకు బోలెడంత ఆసక్తి వచ్చేసింది. వివరాలన్నీ అడిగాను. రాజస్థాన్ వ్యవసాయదారులతో మాట్లాడుతున్నానన్న భావనే ఎంత సంతోషంగానో అనిపిస్తోంది.

"రెండు భీగాల భూమి వుంది. నువ్వులు వేస్తాం. లేకపోతే సెనగలు. నాన్నకు ఓపిక లేదు. అమ్మకు వయసైపోయింది. ఒక్క ఒంటె ఉండేది. అదీ ముసలిదైపోయింది. చచ్చిపోయింది. ఇప్పుడు పల్లెలో ఇరుగుపొరుగుల సాయంతో ఆ కొద్ది పొలం సాగవుతోంది."

హంస్‌రాజ్ ఒక్కో విషయం చెప్పాడు.

"ఆకలి అన్ని విద్యల్ని నేర్పుతుంది మేమ్‌సాబ్ - సేద్యం చేసేవాణ్ణి కారు తోలుతున్నా...! ఏముంది ఆ పల్లెలో దరిద్రం.... గర్భదరిద్రం - నేను పంపిన డబ్బుతో నాన్నకు వైద్యం చేయిస్తోంది అమ్మ...... పూటకు రెండు రొట్టెముక్కలు నంచుకోను ఉల్లిపాయ ముక్కలు చాలు-" హంస్‌రాజ్ చెప్పడం ఆపేసి ఆల్బర్ట్ హాల్ చూపించాడు "అదుగోండి మేంసాబ్..... ఇంగ్లాండు రాజుగారి విడిది కోసం అప్పటి జైపూర్ మహారాజుగారు కట్టించారు. దాన్ని కట్టడానికి తొమ్మిది సంవత్సరాలు పట్టింది. ఇంగ్లాండు రాజుగారు ఇక్కడ బస చేసింది రెండు పగళ్ళు ఒకరాత్రి..!"

లాస్యకి ఇంకా హిందీ రాదు. నేను తనకి అన్నీ వివరించి చెప్తున్నాను.

"హైదరాబాదు సాలార్జంగ్ మ్యూజియం తర్వాత ఇదే పెద్ద పర్సనల్ కలెక్షన్" అక్కడ ఎవరోగైడ్ చెప్తున్నాడు.

హైదరాబాదు పేరు వినగానే నా హృదయం ఉప్పొంగింది. ఆనందంగా చెవులు రిక్కించాను. రాజుల కాలంలో వివిధ వర్గాల ప్రజల లైఫ్‌సైజు బొమ్మలు వారెలా వుండేవారో అలాగే చేసి పెట్టి వున్నాయి.

రాజుల రాణుల ఆడంబరం.

వర్తకుల శోభ.

సేద్యగాళ్ళ లేమి.

అన్నీ కళ్ళకు కట్టినట్లుగా ఎదురుగా నిలబడివున్నాయి.

కాలం మారినా మా స్థితిగతులు మారలేదు సుమా అన్నట్లు!

తర్వాత హంసరాజ్ అమేర్ ప్యాలెస్‌కు తీసుకువెళ్ళాడు.

ఆ కోటకు చెందిన ఒక గోడ "హవామహల్" గా ప్రసిద్ధమైన నిర్మాణం. రాజమందిరంలోని రాణులు జంతర్ మంతర్ కిందుగా వెళ్ళే సొరంగ మార్గం ద్వారా హవామహల్ చేరుకొనేవారట. ఉత్సవాల అప్పుడు ఆ కిటికీల సందులోంచి సంబరాల్ని తిలకించే వారట. హంసరాజ్ లాస్యకు ఒక కిటికీలోంచి ఓరాజకుమారికి చూపించినట్లే జైపూర్‌ను చూపించాడు.

జైపూర్ పాతనగరం వీధి కోలాహలంగా వుంది.

బ్రిటీషు రాజు సందర్శించిన సందర్భంలో ఈ నగరాన్ని రాజస్థానీయుల శుభసూచక వర్ణమైన గులాబీరంగుతో ముంచెత్తడంతో అప్పటి నుంచి ఇది గులాబీ నగరమైపోయింది.

లాస్యకు అమేర్ ప్యాలెస్‌లోని పెద్ద పెద్ద వెండి బానలు నచ్చాయి.

హంస్‌రాజ్ చెప్పాడు.

"మా రాజు ఒకసారి లండన్ వెళ్ళారు రాజాహ్వానం మీద. అక్కడకు వెళ్ళి తిరిగి వచ్చేవరకు వాడుకోవడానికి ఈ వెండిబానల్లో గంగాజలం తీసుకువెళ్ళారట."

"బాప్‌రే………"

లాస్య ఒక్కోటి మనిషెత్తున్న వాటిని కళ్ళు విప్పార్చి చూసింది.

"ఎలా మోసుకెళ్ళారో…… అయినా లండన్‌లో థేమ్స్‌నదిలో కూడా నీళ్ళే కదా ఉండేది." నేను అన్నాను.

హంస్‌రాజ్ నవ్వాడు.

లాస్య ఆనందంగా చప్పట్లు కొట్టింది. "అమ్మా….. రాజుగారు….. రాజుగారు." అక్కడక్కడా ఎయిరిండియా మహారాజుల్లా నిలబడివున్న బుర్రమీసాల ద్వార పాలకులను చూసి.

రాజమందిరమంతా యధేచ్చగా తిరిగాం, ద్వారపాలకులు అడ్డగించేదాకా.

"ఇవ్వన్నీ ఎక్కడో చూసినట్లే వుంది"

"సినిమాల్లో చూసే వుంటారు."

"అమ్మా…. ఆ రాజు మనల్ని ఆ వైపు ఎందుకు పోనివ్వడం లేదు?" లాస్య కోపంతో అడిగింది.

"లోపల నిజమైన రాజుగారు ఉన్నార్ట–"

"నిజంగా–?"

"అవును –"

ప్రదర్శనలో పాత తివాచీలు, సంగీత వాయిద్యాలు, దుస్తులు మొదలైన వేవో పెట్టి వున్నాయి. లాస్య మహారాజుల తైలవర్ణ చిత్రాలు చూసి నవ్వడం మొదలెట్టింది. ఎందుకు లాస్యకు

నవ్వొచ్చిందో మరి హంసరాజ్ సైగలబాషలో లాస్యకు ఏదో చెప్పినట్లున్నాడు. నేను ఏంటన్నట్లు సైగచేసాను. ఏనుగంత లావున్న రాజుగారి చిత్రాన్ని చూపించింది నాకూ నవ్వొచ్చింది.

లాస్యకు ఏనుగుల బొమ్మ వున్న టీషర్టు కొనిపెట్టాను.

వస్తూవస్తూ ద్వారపాలకుణ్ణి అడిగాను.

" నిజంగానే రాజు వున్నారా మందిరంలో"

"ఉన్నారు. మహారాణీ ఆ కొండ మీద కోటలో వున్నారు." అతను చెప్పాడు. ఎంతో భక్తిశ్రద్ధలతో చెప్పాడతను. 'ప్రభుత్వ సొమ్ముతో జీతం తీసుకుంటూ రాజుకి వినయవిధేయతలు చూపుతున్నాడేంటి? ఉండబట్టలేక అడిగేసాను.

"మీకు రాజుగారు ఘనంగా చెల్లిస్తుండాలే"

"ఫర్వాలేదమ్మా నెలకు ఏడెనిమిది వందలు అయినా రోజంతా నిల్చుని చెప్పిందే చెప్పి.... విసుగే... అందులో ఈ బట్టలు......" నవ్వాడతను "ఊపిరాడదు".

హంసరాజ్ నవ్వాడు. లాస్య నవ్వింది.

"మా తాతముత్తాతలు ఎలా వేసుకొనేవారో కానీ మేం ఉడకబోసి చస్తున్నాం" అతను హుషారుగా చెప్పాడు.

"ఈ టిక్కెట్ల డబ్బులన్నీ ఏమవుతాయి?"

"అవన్నీ రాజుగారికే. రాజుకి ఒక్కోసారి రెండు లక్షలు దాటుతుంది కూడా అయితే ఏం? బయట చూసారా. పరదేశీలకు టికెట్లు మూడింతలు ఎక్కువ. – ఆ.... పరదేశీలు మాతో ఫోటోలు దిగుతారు. యినాంలు యిస్తే యిస్తారు. లేకపోతే అంతే". హంసరాజ్ అతనికి ఛాయ్‌కి డబ్బులిచ్చాడు.

నేనివ్వబోతే వారించాడు.

తర్వాత లక్ష్మీనారాయణ మందిర్‌కు తీసికెళ్ళాడు హంస్‌రాజ్

అయిదు నిమిషాల్లో తిరిగేసి వచ్చేసరికి హంసరాజ్ కనపడలేదు. నా గుండె గుభిల్లంది చుట్టూ చూస్తూ అక్కడే నిల్చున్నాను.

లాస్య పావురాల దగ్గరకు వెళ్ళాలని గునుస్తూనే వుంది.

మందిరం మండపంలో చాలామంది స్త్రీలు కూర్చుని వున్నారు. అంతా గులాబీరంగు. లేకపోతే పసుపురంగు దుస్తులు. ముఖాల మీదికి జార్చిన కొంగులు.

ఒకతను డోలక్ వాయిస్తోంటే అందరూ గట్టిగా పాటలు పాడుతున్నారు.

అలాంటి గుంపులు నాలుగయిదు ఉన్నాయక్కడ.

మనుషుల ముఖాల్లోకి తేరిపార చూశాను.

ఏదో వెలితి.

దుస్తుల్లో కానీ మనుషుల్లోగానీ రాజమందిరంలో కనిపించిన కళలేదు.

లేనితనం లేమితనం.

లేదులేదు. అంతా బాగానే ఉన్నారు. తనకే అలా అనిపిస్తోందంతే అబద్ధం.

ఆ ఆడవాళ్ళ ముఖాల్లో ఆరోగ్యం లేదు.

పేలవంగా వున్నాయి.

వాళ్ళు తెల్లటి వాళ్ళు.

కాదు కాదు.

పాలిపోయిన వాళ్ళు.

అందరి చేతులు చూడు మెడలు చూడు ఆ దుస్తులు చూడు.

లేనితనం. లేమితనం.

ఇత్తడి పళ్ళాల్లో పటికబెల్లాల ముక్కలు.

"ఇందాకటి నుంచీ నా ప్రాణం తీస్తున్నావు. ఇకనైనా నన్ను వదిలి పెట్టుతల్లీ...... వాడెవడో నాకు తెలియదన్నా కదా" హంస్‌రాజ్ గొంతు.

నా ప్రాణం లేచొచ్చింది.

"చెప్పన్నా...... పుణ్యం ఉంటుంది....."

ఎవరో స్త్రీ హంసరాజ్ వెంట పడుతోంది. హంస్‌రాజ్ గబగబ మా దగ్గరకు వస్తున్నాడు.

నేను కుతూహలంగా అటువైపు చూసాను.

ఆమె గొంతు విన్నట్లుగా వుంది

వాళ్ళిద్దరూ దగ్గరకు వచ్చారు. హంసరాజ్. ఆ వెనుకే ఆమె.

"అమ్మా...... మీరన్నా చెప్పండమ్మా...."

ఆమె....? ఆ గొంతు....? బసంతీ....?

"బసంతీ......!" నేను ఆశ్చర్యంగా అరచినంతపని చేసాను "ఏం జరిగింది?"

అంతే – నా అరుపుతో అప్పుడే వాలుతోన్న పావురాల గుంపుతోపాటు బసంతీ ఎగిరిపోయింది.

"ఆమె మీకు తెలుసా మేమ్‌సాబ్....." హంసరాజ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మన 'బజార్'లో కట్‌పుత్లీలు ఆడిస్తోంది. సరే........ ఇప్పుడు ఇక్కడ ఎందుకు వుంది?"

"ఎవరో సమందర్.... అన్న టాక్సీడ్రైవర్ అంట. నాకు తెలుసేమోనని అని అడిగింది. నాలాగానే

వుండేవాడట. టూరిస్ట్‌లను తీసుకుని ఇవన్నీ తిప్పుతూ అతని వివరాలడిగింది. ఆమెను తప్పించుకుందామని ఎంత ప్రయత్నించినా వెంటబడుతోంది."

"ఎవరట అతను?" కుతూహలంతో ఉండబట్టలేక అడిగాడు.

"ఈమె ఏమో భర్త అంటోంది. కానీ..... ఇలాంటి.... వ్యవహారాలు... ఇక్కడ మామూలేలే మేమ్‌సాబ్. ఏదో కొన్నాళ్ళు ఈమెతో జల్సాగా గడిపి వాడు చక్కగా ఎటో ఎగిరిపోయి వుంటాడు."

హంసరాజ్ చులాగ్గా తేల్చేసాడు.

నా మనసంతా కెలికినట్లయింది.

బసంతీ..... అంజు... బసంతీ..... సమందర్.....

అయ్యెయ్యో........ బసంతీ....... ఎడారిలో సముద్రమా?

ఎలా నమ్మావ్? నమ్మేసాక.... అంతే!

నాకిక ఏమీ చూడబుద్ధి కాలేదు.

బిర్లాకు వెళ్ళిపోయాం.

మర్నాడు సిసోడియారాణీ కీ భాగ్ మొదలైన చోట్లకి వెళ్ళినా ఉత్సాహంగా లేదు.

దేశంలో ఏ మూలకి వెళ్ళినా భారతీమణులంతా ఒక్కటే.

అదే కథ అదే వ్యథ.

అప్పటి జైపూర్ మహారాజు సిసోడియా రాజకుమారిని వివాహం చేసుకొన్నాడు. ఆమె కొడుకునే రాజును చేస్తానన్న వాగ్దానంతో.

ఆమె ఇతర రాణులతో కలవకుండా ప్రత్యేక మందిరం కట్టించుకుందిట.

మహారాజు చనిపోయాక మహారాణి కొడుకునే రాజును చేసారు. ఎలా జరిగిందో కానీ అతను పట్టాభిషేకం జరిగిన కొద్దిరోజులకే మరణించాడుట.

సిసోడియా రాణి కుమారుడు రాజయ్యాడట!

రాజుల లాలసత్వాలు...... రాణుల కుతంత్రాలు...... సవతుల పోర్లు....... కొడుకుల పట్టాభిషేకాలు..... అబ్బబ్బ..... వద్దొద్దు.....

బసంతి..... అమాయకత్వం .... సమందర్.... మోసం

సిసోడియా రాణి..... బసంతి.

జైపూర్ రాజు..... సమందర్.....

ఎలాగైతేనేం రాణీ గారి కొడుకు రాజయ్యాడు.

బసంతి కూతురు...... అయ్యెయ్యో........

అంజు......... అంజు..... అంజూ....... !?!

సాయంత్రం శశిని కలుసుకున్నాం.

శశి వాళ్ళ సదస్సు మరునాటికి పూర్తవబోతోంది.

"ఇంతకీ ఇంతమందీ కలసి ఇన్ని రోజులు చర్చించి ఏమి తేల్చారు?"

నేను ఆసక్తిగా అడిగాను.

"ఏముందీ! కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర, శుభ్రమైన నీళ్ళు, పరిశుభ్రమైన పరిసరాలు ఉంటే ఎన్నో జబ్బులు ప్రపంచ పటంలోంచి మాయమవుతాయని" శశి నవ్వుతూనే గంభీరంగా చెప్పాడు.

"అయ్య బాబోయ్..... అంత సులువుగానే!" నేనూ నవ్వాను.

కానీ నా కళ్ళముందు బసంతి – అంజు.

కడుపునిండా తిండి ఎలా దొరుకుతుంది?

నా కళ్ళముందు సిసోడియా రాణీ – కువర్‌జీ.

కంటినిండా నిద్ర – ఎలా ఉంటుంది?

తిండి లేకపోతే నిద్రపట్టదు.

నిద్రలేకపోతే తిండి సహించదు.

అంతా అయోమయం.

ఇదున్న వాళ్ళకి అదుండదు. అదున్న వాళ్ళకి ఇదుండదు.

అంతా అనారోగ్యమే.

అనారోగ్యమే అనారోగ్యం!

మర్నాడు ఉదయం ఎక్కడికీ వెళ్ళబుద్ధికాలేదు.

బిర్లాకు వెళ్ళి అక్కడే ఈ పూట గడిపేద్దామని అనిపించి లాస్యను బిర్లా ప్లానిటోరియంలో అంతరిక్ష శోధనలు చూపించాను.

బిర్లా కన్వెన్షన్ హాలులో అటూ ఇటూ తిరుగుతూ పచ్చిక మీద వేసిన కుర్చీలలో కూర్చున్నాము.

పచ్చని గడ్డి మీద నులివెచ్చని ఎండ ఆహ్లాదంగా వుంది.

లాస్య అక్కడే ఆడుకుంటున్న మరికొందరు పిల్లలతో జట్టు కట్టేసింది.

రంగురంగుల బెలూన్ల వెంట పరిగెత్తుతూ ఆడుకుంటున్నారు.

పిల్లల ప్రపంచం ఎంత హాయి.

భాషలు లేవు. వాళ్ళకు వున్న భాషంతా ఆటల భాషే. ఆటాడుకుంటూ–మాటాడుకుంటూ...

ఎంత హాయి... ఎంతోహాయి.

కట్‌పుత్లీల ఆట దగ్గరకు వెళ్ళి బసంతితో మాట్లాడాలనిపించింది.

సమందర్ గురించి.... కాదు.... కాదు.... అంజు గురించి'

"బజార్" అంతా సందడిగా వుంది. ఆఖరి రోజవడంతో ఎవరికి వారు సామాన్లు సర్దేస్తున్నారు. డేరాలు విప్పేస్తున్నారు. ఆఖరి ప్రయత్నంగా కొనేవాళ్ళు హడావుడి బేరాలు చేస్తున్నారు.

ఎవరి గోలలో వాళ్ళు. ఎవరి కంగారులో వాళ్ళు. అంతా నానా కంగాళీగా వుంది.

బసంతి, డోలక్ వాయిద్యగాడు కట్‌పుత్లీలు అమ్మే చోట కూర్చుని వున్నారు.

నేను వెళ్ళేసరికి డోలక్ వాయిద్యగాడు కరుకుగా గట్టిగా అంటున్నాడు.

"నా మాట విను..... అంజుతోనే ఆడించు...... నువ్వు వయసు మీరిపోయావు. చలాకీగా చేయలేవు. అయినా ఇక్కడ జరుగుతోన్న హంగామా అంతా చిన్నపిల్లలకోసమే అంట. మొన్న ఉదయ్‌పూర్‌నుంచి ఆ డాక్టరుగారి పాప వచ్చి నాట్యం చేయలేదూ... నీ కూతురు అంత కన్నా మురిపెమా..... చాల్చాల్లే...."

"అది కాదు....... ఆ పిల్ల వళ్ళు పేలిపోతోంది. నోట్లో నీటిచుక్కకూడా పోయలేదు......." బసంతి కంఠం బొంగురు పోయింది.

"నీటి చుక్క కాకపోతే సముద్రాన్నే తెచ్చిపోయి! సమందర్ గాడి సంతానం కదా........ దాహం ఎక్కువేలే......" అతడు వ్యంగ్యంగా అన్నాడు.

"పిల్ల చిన్నది....."

"అహ.....! నువ్వు కూడా చిన్నదానివేలే! చివరిసారిగా చెపుతున్నా విను. సాయంత్రం అమర్ క్లార్బ్‌లో అంజు ఆడాల్సిందే. నేను వాళ్ళ దగ్గర అడ్వాన్స్ కూడా తీసుకున్నా......"

"అయితే ముందు కొంత డబ్బు ఇవ్వు. పిల్లకి మందు ఇప్పిస్తా......"

"పిల్లకి మందు ఇప్పిస్తావా....... నువ్వు మందేసుకు తొంగుంటావా? "వుల్లూకీ పట్టీ" వాడిక తిట్లు లంకించుకున్నాడు. "నమక్‌హరాం... "సమందర్ గాడు ఉమ్మేస్తే వచ్చి నా వళ్ళో పడ్డావ్! నా మోచేయి నీళ్ళు తాగుతున్నావన్న కృతజ్ఞత అన్నా లేదు....... సువర్‌కైకీ......"

వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది.

నాకిక అక్కడ మాట్లాడే అవకాశం లేదని చక్కగా అర్థమైంది.

"నువ్వు మనిషివా, పశువ్వా...... పసిపిల్లని...." ఆడపులిలా ఎదురు తిరిగింది బసంతి.

"పశువునే. లేకపోతే చొంగ కార్చుకుంటూ నీ వెనుక ఎందుకు పడతాను...... అయినా నేనేమన్నా పరదేశీ టూరిస్ట్‌ల గదులకు పంపమన్నానా...... దేశీల ముందు ఆడమన్నావా....... అందరూ గొప్పవాళ్ళే. "ఇనాంలు కూడా ఇస్తారు..."

"హే హిజ్డా..... నా కూతుర్ని ఆడించి ఆ డబ్బుతో జల్సాలు చేద్దామనిరా? ఎక్కడ సమందర్ ఎక్కడ నువ్వు! సమందర్ నా కూతురి తండ్రి. పోతే పోయాడు. నువ్వు క్షణక్షణం నన్ను ముక్కలు ముక్కలు చేసి తింటున్నావుకదరా పాపిష్టివాడా! నా కూతుర్ని పరదేశీ గదులకు పంపుతావా. ఏదీ పంపు చూద్దాం - నా కంఠంలో ప్రాణం వుండగా-"

"ఏయ్ రండీ.... క్యా బోల్తీ తూ.... మై... హిజ్డా!" వాడు పళ్ళు పటపట కొరికి బసంతి మీదకు లంకించాడు. బసంతి మీద ఎక్కి కూర్చుని ఎడాపెడా కొట్టడం మొదలెట్టాడు.

నేను కొయ్యబారిపోయాను. తేరుకొని ముందుకు వెళ్ళేసరికే... ఏం చేయాలో ఏం చేయకూడదో.

బసంతి వాణ్ణి రక్కి కొరికి తన్ని ఎలాగో వాడినుంచి తప్పించుకుని డేరా వెనుకకు పరిగెత్తింది. వాడూ అదే వేగంతో పరిగెత్తాడు. అన్నీ కళ్ళు మూసి కళ్ళు తెరిచే లోపల!

నాకు కాళ్ళు చేతులు ఆడలేదు. చుట్టూ చూసాను. ఎవరి గోలలో వాళ్ళున్నారు.

వాడి మోటుతనం... రౌద్రం... క్రౌర్యం...

శశి ఎప్పుడు వచ్చాడో లాస్యతోపాటు నా దగ్గరికి రాగానే చూసిందంతా గబగబ శశికి చెప్పాను.

శశితో పాటు బసంతి దగ్గరకు పరుగుపెట్టాను.

అక్కడ ఎవరూ లేరు.

అక్కడ ఏదన్నా ఘటన జరిగిన ఆనవాళ్ళు కూడా లేవు.

పక్కవాళ్ళని అడిగితే వాళ్ళు వెళ్ళిపోయారన్నారు.

నా అనుమానం తీరక డేరా వెనక్కి వెళ్ళాను.

అక్కడా లేరు. ఏమిటిదీ? మాయా?

శశి "బజార్" సెక్రటరీ దగ్గరికి వెళ్ళాడు.

"ఓ కట్‌పుత్లీవాలే.....? వాళ్ళెప్పుడు కీచులాడుకుంటూనే ఉంటారు - మళ్ళీ రేపు మామూలే - వదిలేయండి సార్......" అతను నింపాదిగా అన్నాడు.

నేను, శశి విప్పదీస్తోన్న అంగళ్ళ మధ్య, వీడ్కోలు చెప్పుకుంటోన్న గుంపుల మధ్య వెతికాం.

బసంతీ కానీ అంజు కానీ ఎక్కడా కన్పించలేదు.

"ప్చ్....." శశి పెదవి విరిచాడు. "మనమేమీ చేయలేం..."

"నా బుర్రకి తట్టింది కాదు అంజుకి మందన్నా ఇచ్చి వుంటే....."

"పోన్లే సరితా - వెళదాం ఇక. అయినా మనం ఈ రోజుంటాం. రేపు వెళతాం. బసంతి సమస్య మనం తీర్చేది కాదుగా...."

సాయంత్రం ఆ హోటల్‌లోనే వీడ్కోలు బాంక్వెంట్.

పార్టీ హడావుడిలో ఎవరిపాటికి వాళ్ళున్నారు.

ఒక్క పక్కన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి జోరుగా, హుషారుగా ఘుల్ ఘుల్ న చలాకీ నాట్యం మొదలైంది.

"ఛలోజీ / బవాజీ అబ్ బజారామే జానా......

సునోరేరే... సునోరేరే... దరమ్‌భాయీ... దరమ్‌భాయీ...

మైతో కోఢీ మే రామగఢ్ లూట్ లే ఆయీ....."

అంజు !

నేను ఆనందం పట్టలేకపోయాను. శశి చెయ్యిచరిచి మరీ చూపించాను. అంతలోనే అంజు అనారోగ్యం గుర్తొచ్చింది.

'అరే పాపం ! ఎలా ఆడుతోంది?'

అంజు గిరగిరా బుట్టబొమ్మలా.... పుత్తడి బొమ్మలా తిరుగుతోంది. బుజ్జి పాదాల కదలిక చిన్ని ముఖంలో అభినయం.... ఆ చురుకు..... ఆ వేగం అబ్బ.... మొత్తానికి ఈ అమ్మాయి అసాధ్యురాలే. చెంగుచెంగున ఎగురుతూ....

నేను బసంతి కోసం ఆత్రంగా వెతికాను.

బసంతి, డోలక్ వాయిద్యగాడు ఇతర కళాకారులతో పాటు కలిసి కూర్చుని ఉన్నారు. పాట పాడేది బసంతే.

అయితే అంతా సర్దుకున్నదన్నమాట! మరి పొద్దున చూసినదంతా.......? కలా? భ్రమా?

కుండమీద కుండలు పెట్టి....... అంజుకన్నా తలమీది కుండలు వరుస పొడవుగా వుంది.

"నాన్నా..... నాన్నా...... ఫైవ్‌స్టార్ అమ్మాయి........... అంజు......"

లాస్య ఆనందం చెప్పలేనంతగా ఉంది. చప్పట్లు కొట్టి గెంతు లేసింది సంగీతం ఊపందుకుంది. వాయిద్యాలు జోరు అందుకున్నాయి.

అంజు తలమీద కుండలతో వంగి రుమాలును పెదవులతో పైకి లేపింది.

చప్పట్లు.

కత్తుల వరుస మీదా, మేకులమీదా నాట్యం అయిపోయింది.

చప్పట్లు మీద చప్పట్లు.

బసంతి గాజు పెంకులు తెచ్చిపెట్టింది

అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు.

అంజు గిరగిరా తిరుగుతూ గాజుపెంకుల మీదా నాట్యం చేసేస్తోంది.

చప్పట్ల వర్షం కురిసింది.

గాజుపెంకుల మీద నుంచి గుండ్రంగా అంజు గిరిగిరా బొంగరంలా తిరుగుతోంది వేదికమీద.

ఇంతలో వేదిక మీదికి వేగంగా దూసుకొచ్చాడు శశి!

నా పక్క నుంచి ఎప్పుడు వెళ్ళాడో ఏమో -

ఎందుకు వెళ్ళాడలా - సభా మర్యాద లేకుండా - నేను ఆశ్చర్యంతో లేచి వేదిక దగ్గరగా నడిచాను.

శశి రావడం అంజు వేదికమీద పడిపోవడం ఒక్కసారే జరిగాయి.

శశి అంజుని అమాంతం చేతుల్లోకి తీసుకుని వేదిక పక్కకి దిగేసాడు.

నేను పరిగెత్తాను.

సంగీతం ఆగలేదు.

బసంతి నాట్యం చేస్తోంది.

అందరూ కార్యక్రమంలో భాగం అనుకున్నారో ఏమో అంజుకి అభినందనలుగా, బసంతికి ఆహ్వానంగా చప్పట్లు కొడుతూ ఉన్నారు.

శశి వేదిక వెనక అంజుని వెల్లకిలా పడుకోబెట్టాడు.

కల్చరల్ సెక్రట్రీ, ఆర్గనైజర్స్ శశి దగ్గరకు వచ్చారు.

శశి వాళ్ళతో ఏదో మాట్లాడారు.

కల్చరల్ సెక్రట్రీ పాపని వెంటనే తన కారులో తన ఆసుపత్రికి పంపేసాడు. అన్నీ క్షణాల్లో అన్నిటికి అతీతంగా బసంతికి వేదికమీద నాట్యం చేస్తూనే వుంది.

నేను నిల్చున్న చోటికి వేదిక స్పష్టంగా కనిపిస్తోంది.

తల్లా... రాక్షసా...

నేను బసంతి వైపు కోపంగా చూసాను.

నా చూపు వేదిక మీదకు పడింది.

వేదిక నిండా అంజు బుజ్జి బుజ్జి ఎర్రటి అడుగులు.

పాదాలని రక్తంలో అద్దినట్లుగా......!

"గాజు పెంకులు గుచ్చుకున్నాయ్" శశి నా పక్కకు వచ్చి అన్నాడు

"నువ్వెలా గుర్తుపట్టావ్?"

"పొద్దున చెప్పావుగా సరితా - అంజుకి వంట్లో బాలేదని. ఆ వేగం చూస్తే అనుమానం

వచ్చింది. అంజు ముఖంలో స్పృహ తప్పబోతోన్నట్లు స్పష్టంగా అనిపించింది. అమ్మాయి నాట్యం ఆపించాలని వచ్చాను. కానీ జరిగింది మరొకటి."

శశి చెప్తూనే వున్నాడు.

బసంతి నాట్యం అయిపోయి సభకు వంగి వంగి నమస్కారాలు పెట్టి మా దగ్గరికి వచ్చింది.

బసంతి మీద నాకు పీకల్దాకా కోపం వచ్చింది.

ఏం మాయరోగమొచ్చిందో - అంజుకి ఇలాంటి స్థితి తెచ్చిపెట్టింది.

కన్నకడుపా? పాషాణమా -? ఛీ......!

"నా బిడ్డ ఏది?" ఆమె వెళ్ళి డోలక్ వాయిద్యగాడ్ని నిలదీసింది.

"నిజం చెప్పు ఏం చేసావ్ అంజుని?"

"చేయాల్సిందే చేశాను. గాజు పెంకుల్ని అడ్డదిడ్డంగా పగలుగొట్టి మొనలు పైకి పెట్టాను. జింకలాగా ఎగురుతోంది కదా నీ కూతురు... కసుక్క్...! అంతే.... అవి కాళ్ళలో దిగబడ్డాయి. మళ్ళీ ఎప్పుడో అంజు ఆడేది! మీ చావు మీరు చావండి. సమందర్‌లో దూకుతావో..... రాయ్‌గఢ్ మీదెక్కి దూకుతావో......." వాడు నిర్లక్ష్యంగా అని తన డోలక్ భుజాన వేసుకుని వెళ్ళిపోయాడు.

బసంతి తలపట్టుకుని నేలమీద కూలపడింది.

"అవి అరికాళ్ళల్లో లోతుగా గుచ్చుకుపోయాయి. బ్లీడింగ్ ఆగడం లేదట. సర్జన్‌ని పిలిపించాము. ఎంత దారుణం! నేను ఇలా జరుగుతుందనుకోలేదు..... ఇక్కడ ఈ నాట్యం అందరూ చేస్తారు. నిన్న ఉదయ్‌పూర్ డాక్టరుగారి అమ్మాయి కూడా చేసింది.... ఇలా..... ఇలా.. ఎందుకు జరిగిందో...? "కల్చరల్ సెక్రట్రీ శశితో బాధగా అన్నాడు.

"అయినా ఆ అమ్మాయి అలాగే ఎలా నాట్యం చేసిందో....."

"అర్థం కావడం లేదు."

శశి ఏమీ మాట్లాడలేదు. గంభీరంగా తలాడించాడు.

ఇద్దరూ కాసేపు చర్చించుకున్నారు. అంజుకి చేయవలసిన చికిత్సగురించి. ఆ డాక్టరుగారి కారులో బసంతి కూతురి దగ్గరకి వెళ్ళిపోయింది.

"వారం రోజుల్లో అంతా సర్దుకుంటుంది. కానీ ఆ బసంతికి అదేం పోయ్యే కాలం. అంజు కింద పడిపోయినా ఈమె నాట్యం చేయడం! ఇదేమన్నా ఇంద్ర సభా నాట్యం ఆగితే బ్రహ్మాండం బద్ధలవ్వడానికి! అదో బడాయి." నేను కోపంగా కచ్చిగా అన్నాను.

"ఆమేం చేస్తుంది సరితా..... బసంతి ఈ సమాజం ఆడించే ఒక కట్‌పుత్లీ! అంతే! ఆమె ఆడకపోతే ఆమె కడుపు నిండదు. ఆమె బిడ్డ కడుపు నిండదు. కడుపు నిండినాక చెప్పే కబుర్లు కాదుగా ప్రేమంటే! ప్రేమ లేకుండా ఎలా వుంటుంది? కడుపుకోత లేకుండా

ఎలావుంటుంది?"

"ఆ.... ఉంటుంది..... ఇప్పుడు చూడండి. ఆ డాక్టరునే మాయ చేసి అన్నీ చక్కగా జరిపించుకుంటుంది. అసాధ్యురాలు-" నా కోపం ఇంకా తీరలేదు.

"ఏం చేసినా కట్టు కట్టి పంపడమేగా - ఆ తర్వాత మళ్ళీ వాళ్ళ కథ మొదలు - మళ్ళీ వాళ్ళిద్దరూ కట్టుబట్టలతో కడుపుచేతబట్టుకొని వీధిలోకి - అంతే!"

నిజమే. ఎవరమైనా ఏం సహాయం చేస్తాం బసంతికి. ఆమెకు ఆమే చేసుకోవాలి. రేపు రైలెక్కామంటే మేమెవరమో ఆమెవరో - ఆ డాక్టరుకి అప్పచెప్పడమే మంచిది. గుడ్డిలో మెల్ల. గాలికి వదిలేయకుండా ఎవరైనా సాయం చేస్తారు.

మర్నాడు ఉదయం హోటలు బిల్లు కడుతోంటే డోలక్ వాయిద్యగాడు కనిపించాడు. హోటల్‌వాడు అతనికి నోట్లపొత్తి అందించాడు. అతను నవ్వుతూ అంటున్నాడు. "ఆ ఏడుపుగొట్టు మొహాన్ని పోనీయండి సార్- ఈసారి మంచి వాళ్ళని తీసుకొస్తా - ఏక్ధమ్ ఫస్ట్ కిలాస్....." వాడు వెకిలిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

నాకు గుండెలో కెలికినట్లయింది.

నేను పరాగ్గా బయటికి వచ్చాను.

హోటల్ గేటు దగ్గర బసంతి నిలబడి వుంది. డోలక్ వాయిద్యగాణ్ణి చూడగానే అమాంతం పరిగెత్తుకు వచ్చింది.

వాడి కాళ్ళవేళ్ళాపడి ఏదో బతిమలాడుతోంది.

వాడు ఛీత్కరించుకుంటూ... విదిలించుకుంటూ...

ఛ... ఛ... అసహనంతో ముఖం తిప్పుకున్నాను.

శశి, లాస్య సామాను కారులో పెట్టి నన్ను పిలిచారు.

వెళుతోన్న కారులోంచి నేను బసంతివైపు చూడకుండా ఉండలేకపోయాను.

ఈమె హిందీ సినిమాల్లో తరుచూ చూసే మెరుపుతీగ లాంటి రాజస్థానీ కళాకారిణి కాదు.

డొక్క మాడిపోయి.... ముఖం పీక్కుపోయి... కళ్ళు గుంటలుపడి... హృదయవిదారకంగా విలపిస్తూ రంగురంగుల బట్టల వెనుక.. అద్దాల తళుకుల మధ్య మూర్తీభవించిన విషాదం-

బసంతి...

వసివాడిన వసంతం.

ఓహ్......

నేను కళ్ళు మూసుకున్నాను. మా కారు ముందు కెళ్ళి పోతోంది.

హంస్‌రాజ్ – మహారాజు – సిసోడియారాణి – బసంతి – సమందర్ – అంజు – డోలక్ వాయిద్యగాడు...

నా కళ్ళ ముందు కదిలిపోతోన్న అస్పష్ట చిత్రాలు...

గులాబీ నగరంలోని రాజమందిరాల శోభలు నన్ను ఎందుకనో ఆకర్షించలేదు.

లాస్య దారాలు పట్టుకొని ఆడించాలని ప్రయత్నిస్తోన్న కట్‌పుత్లీలను పరిశీలనగా చూసాను.

కళ్ళముందు గిరాగిరా తిరుగుతోన్న "డోలామారు" అంజూ... కదలాడుతోంది...

"రామగఢ్ లూటూ యా జయపూర్ లూటూ

మై తో పీతల్‌కీ సాడీ లే ఆయీ...... లే ఆయీ.....

మై తో కోఢీ మే రామ్‌గఢ్ లూట్ లే ఆయీ......

అంజూ అలా తిరుగుతూనే వుంటుంది.

బసంతి అలా ఆడుతూనే వుంటుంది.

ఆ కనిపించని దారాలను పుటుక్కున తెంపుకొనేదాకా!